# జీవనరాగం

వయొలిన్‌పైన చక్రివాకరాగాన్ని పూర్తిచేసి రాజశేఖరం కమాను పట్టుకున్న కుడిచేతిని కుడికాలుపై వుంచి, సన్నని కంఠస్వరంతో ఆ రాగస్వరాన్ని తనలో తను అనుకుంటున్నట్లుగా అన్నాడు. అన్నదే తిరిగి తిరిగి అనుకున్నాడు. అలా అనుకున్నవిధంగా కాకుండా మరోవిధంగా వయొలిన్‌పై పలికించాడు.

రాజశేఖరం కళ్ళల్లో ఆశ్చర్యం, ఆనందం తొణికిసలాడినై.

సాఫీగాపోతున్న రాజబాట రెండుగా చీలిపోయినట్లుగా చక్రివాకం సగంలో మలుపుతిరిగి సౌరాష్ట్రిలో కలిసిపోతోంది. ఆ మలుపు తిరగకుండావుంటే చక్రివాకమే. ఆ మలుపుదగ్గర అప్రిమత్తతతోవుంటేనే చక్రివాకం సొగసును ఒలికిస్తుంది. ఏమాత్రిం మెళుకువ తప్పినా సౌరాష్ట్రిలో కలిసి రూపాన్ని కోల్పోతుంది.

రాజశేఖరం సన్నగా నవ్వుకున్నాడు.

జీవితంకూడా అంతేగదా! ఒక నిర్ణీతపథంలో నడిచే జీవనరథం అనుకోని మలుపు తిరిగినపుడు దానిగమనం, గమ్యం పూర్తిగా మారుతాయి.

"నీవు కలెక్టరువు కావాలిరా! ఈవిధంగా నీజాతకంలో రాసిపెట్టివుంది. శ్రద్ధగా చదువుకోరాజా!" అనితండ్రి చెప్పినపుడు షడ్జమంలో వీణశ్రుతిలా నవ్వేడు రాజశేఖరం.

కొడుకునవ్వు, ఆ నవ్వులోని నిర్లక్ష్యం, అవహేళన తండ్రిని మరి మాట్లాడనీయలేదు. తనజోస్యం, ఆ జోస్యం ఆధారంగా తాను కనిన కలలు— భాస్కరునిముందు చంద్రకిరణాల్లా— వెలాతెలాపోయి చివరకు కనుమరుగైపోతుంటే కుంగిపోని తండ్రెవరుంటారు? "మీమాట కాదంటున్నానని బాధపడకండి నాన్నగారూ, ఈ చదువులమీద నాకు నమ్మకం కుదరటంలేదు. సంస్కృతికీ సభ్యతకూ సాక్షీభూతమైన భారతీయకళ లెన్నిలేవు? జీవితం ఈజానెడుపొట్ట పోసుకోటానికే అయితే ఆ మాత్రం ఆదరువు నాకీ సంగీతకళ ప్రసాదించకపోదు"

విదేశ వస్తువులతోపాటు విదేశ చదువుల్నికూడా బహిష్కరిస్తూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం దేశం తహతహలాడుతున్న రోజులవి. కొడుకుధోరణికి భయపడినా 'అదే' మనలేదు తండ్రి. ఎలా అనగలడు?

పసివాడుకాడు, ప్రపంచంతెలియని వయసూకాదు. ఇరవైఏళ్ళప్రాయం. మంచేదో— చెడేదో నిర్ణయించుకొని, మనసుకు నచ్చిన సంగీతాభ్యాసం చేస్తానంటే ఏమని వారించ

గలడు ? 'నీ వీ విద్యలో రాణించినా జీవితంలో బీదతనాన్ని పోగొట్టుకోలేవు. నీమీద ఆధారపడి నిన్ను నమ్ముకున్న వాళ్ళను సంతోషపెట్టలేవు' అని అశుభాన్ని పలికి ఉత్సాహంతో ఉరకలువేసే లేతమనసుపై చల్లని నీటిని చిలకరించటం దేనికి లెమ్మనుకున్నాకున్నాడో ఏమో ? 'నీ యిష్టం' అని మిన్నకున్నాడు.

అదే తన జీవితానికి మలుపు. ఆ మలుపు తిరగకుండా తండ్రి సలహాపై చదువు పూర్తిచేసివుంటే నిజంగా తను కలెక్టరయ్యే వాడేమో! చక్రివాకంలా తీయని జీవితాన్ని గడుపుతూ వుండేవాడేమో ?

కాని అలాజరగలేదు. మలుపుతిరిగింది. నిత్యజీవితం నిత్యనూతనమైన కడగండ్లలో సౌరాష్ట్రినే చూపిస్తోంది.

"ఏమండీ" జీవితపు చుక్కానీ — సీతమ్మ పలకరించింది.

ఎడమచేత్తో వయొలిన్‌ను తలక్రిందులుగా ఒళ్ళో నిలబెట్టి 'పిల్చావా!' అన్నాడు కుడిచేతిలోని కమాన్‌ను ఆడిస్తూ. "మర్చిపోయారా ?" "ఏంవిటి ?" "అయ్యో !" అన్నదా యిల్లాలు దీనంగా.

రాజశేఖరం ఆశ్చర్యంగా ఆమెవైపు చూసేడు.

సన్నగా తెల్లగా ఎముకలగూడులావున్న ఆకారాన్ని రంగువెలిసి తెల్లమొహంవేసిన చౌకరకం జీర్ణవస్త్రం మొకటి అంటిపెట్టుకొని వుండాలని తాపత్రియపడుతోంది. మూడో

వంతు జీవితానికే ముష్పాతిక గడిచినట్లు శిరోజాలు తెల్లగా నవ్వుతున్నాయి. నిత్యం లేమినే అనుభవిస్తున్నా, నాకు లేమి అంటే ఏమిటో తెలియదన్నట్లు తెల్లని వెల్ల వేసినట్లుండే ఆమె చిరునవ్వు, ఆ చిరునవ్వును ప్రకాశవంతం చేయటానికా అన్నట్లు స్వచ్ఛంగా మెరిసేకళ్ళు— ఇదీ ఆ చుక్కానీ రూపం.

"పైగా అలా చూస్తారేమిటి? దిష్టిబొమ్మలా వున్నాననేనా!"—ఆ గొంతులో జీర.

"చూడటంకాదు. నీవు నాకేంచెప్పావా, నేనేం మరచిపోయానా అని ఆలోచిస్తున్నాను."

"చేతిలో ఫిడేలుంటే మీ కింకేమీ అక్కర్లేదు."

"ఆసంగతి మర్చిపోలేదుగదుటే!" "వేళాకోళానికి వేళా పాళావుండాలి గాని, ఈపూటకూడా వుపవాసమేనా?"

రాజశేఖరం ఉస్సురన్నాడు. రాత్రి తనూ, తనతో పాటు యిల్లాలూ ఉపవాసవ్రతం ఆచరించిన జ్ఞాపకం నీరసంలా ఆవరించింది మనసునంతా. తల వంచుకొని కళ్ళు దించుకొని చేతిలోని వయొలిన్‌ను పెట్టిలో సర్ది "ఇప్పుడేవస్తాను ఆసంచి యిలా అందుకో" అని పురమాయించాడు.

సీతమ్మ సంచీ తెచ్చిస్తూ, "రెండునెలలనుంచీ డబ్బివ్వ లేదని ఈపూట పాలవాడు పాలు పొయ్యలేదు. పక్కింటి పిన్నిగార్నడిగి కాసిని పోయించుకొని కాఫీపెట్టాను.'ప్రొద్దుట. ఇంకాస్సేపుంటే చంటిది సంగీతం ప్రారంభిస్తుంది' అంది,

పాలడబ్బా కొనిపెట్టుకొంటే, ఇలాంటి ఇరుకు సరుకులకు ఉపయోగించునుగదా అనే అర్థాన్ని ధ్వనింపజేస్తూ.

"వాడు పోసే తెల్లనీళ్ళకు డబ్బుకూడా ఇవ్వాలంటావా ?"

"చేతిలో డబ్బుంటే అడక్కుండానే ఇచ్చేవారుకదూ మీరు ?"

రాజశేఖరం నొసలు చిట్లించి నోటితో ఏదోరాగాన్ని అస్పష్టంగా అనుకుంటూ, చేతివ్రేళ్ళతో తాళంవేసుకుంటూ ఆశాభావంతో ముందుకుచూస్తూ నడిచేడు.

సందుమలుపు తిరగ్గానే ఆయన కెదురైన పెద్దసమస్య-ఎక్కడికి వెళ్ళటమూ అని. ఇంకా నెలలో సగమైనా గడవ లేదు. తనకున్న రెండుపాఠాలజీతం యాభై రూపాయలూ ముందుగానే వాడుకున్నాడు. పెద్దవాడు సెలవులకని యింటి కొస్తే వాడికి పాంటూ, షర్టూ కుట్టించాలని ఇంటి ఇల్లాలు మోజుపడితే, అందుకూ, పండగఖర్చుకూ కలిసి ముఫ్ఫై రూపాయలు మట్టసంగా వాడేడు. మిగతా యిరవై యింటి ఖర్చుకు వారం రోజుల్లోసరి. "నెల కాకముందే జీతం వాడు కుంటే ఎలా మాష్టారూ ?" అనే పాఠాలుకావు కాబట్టి సరి పోయింది. లేకపోతే ఎంత ఇబ్బంది పడవలసివచ్చేదో !"

"ఏం మాష్టారూ, కాఫీరాగం అనుకుంటూ బయల్దేరారు, కాఫీకేనా ఏం ?" నవ్వుతూ పలకరించిన పలకరింపుకు ఈలోకంలోపడి ఎదుటివ్యక్తిని చూసేడు రాజశేఖరం.

హెడ్మాష్టరుగారు! "లేదండీ, బజారుదాకా...." "ఆఁ....
అన్నట్టు మర్చేపోయాను. మొన్న నేను చెప్పిన ఆఫీసరుగారిని
కలుసుకున్నారా?" "కలుసుకున్నానండీ."

"పాఠం కుదిరిందా?"

రాజశేఖరం పెదవి విరిచాడు. "సంగీతం అంటే ఆయన
కిష్టమే గాని, వాళ్ళమ్మాయి కిష్టం లేదట!" "ఆఁ హాఁ
పోన్లెండి, ఏంచేస్తాం? ఎవరియిష్టాలు వారివి........ పాఠాలు
బాగా వున్నాయా" "ఏదో...."

"వస్తానండీ. మీ ఆనందాన్ని భంగంచేసేను." సైకిలు
ముందుకు సాగింది.

రాజశేఖరం పెదవులమీద చిరునవ్వు చిత్రంగా విరి
సింది—ఆనందం!

అవును. తననుచూసి ఎవ్వరూ 'ఈయన అప్పడగ
టానికి వచ్చినట్లున్నాడే, అని అనుమానించటానికి వీల్లేదు.
ఆమాటకొస్తే, తనుమాత్రం ఏనాడు, ఎవర్ని 'దేహి' అని
అడిగేడు? ఎదుటివారి దయాధర్మాలపై తా నేనాడూ
ఆధారపడలేదు, ఆ భావనే తను భరించలేదు.

ఈ విషయం తన శిష్యులకు, శిష్యురాండ్రకూ
పరిచయస్థులకు, చివరికి సీతమ్మకు, పిల్లలకుకూడా తెలుసు.
తెలిసినందువల్లనే సీతమ్మ పన్నుకదపకుండా పస్తులుంటోంది.

ఎన్నాళ్ళీ పస్తులు? భార్యకు అన్నంపెట్టలేని పెళ్ళెం
దుకు చేసుకున్నావ్? భార్యకే అన్నంపెట్టలేని వాడివి పిల్లల్ని

........ఎవరో గొంతెత్తి అరిచినట్లుగా భావన కలిగింది, రాజశేఖరంకు. తనది కేవలం భావనే అని తెలుసు. కాని, ఆ భావన వాస్తవరూపం దాల్చకూడనంత అసంబద్ధమైనది కాదుగా? అయితే, తన నావిధంగా నిలదీయగల కంఠం ఎవరికుంది?

అది తన అంతరాత్మ! ఎవరికంఠమూ కాదు!

సీత సత్యకాలపు స్త్రీ అయింది.

సుదూర తీరాల్లో భూతకాలపు కొండలవెనుక దాగిన రోజులే నయమనిపిస్తోంది. ఆ రోజుల్లో విద్వత్తుకూ విజ్ఞానానికీ విలువవంటూవుంది. అవి సంపాదించుకున్నవాడు భుక్తిగడువక పస్తులున్న రోజుల్లేవు అప్పుడు. కళాదరణను గూడా కళగా భావించిన రోజులవి.

ఇప్పుడో! పండితులచే 'సెబాష్' అనిపించగల ప్రతిభ ప్రజ్ఞ, తనకున్నాయి. కాని, వాటిని ప్రదర్శించటానికి అవకాశమేదీ?

రాజశేఖరం తక్కున నిలిచిపోయాడు. ఏమిటి తన పిచ్చి! ఈరోజుల్లో కళల్ని ఆదరించి, కళాకారులని సన్మానించ గల తీరిక, కోరిక, శక్తి ఎవరికున్నాయి? ప్రతివ్యక్తీ తన ఆర్జన తనకు సరిపోక అధిక సంపాదన కోసం అనుక్షణం అర్రులు సాచి కూర్చుంటున్నాడు. ఎందుకని? తన ఆర్జన జీవితావసరాలకు సరిపడకనా? ఎందుకు సరిపడదు? వస్తువుల ధరలు విపరీతంగా పెరగటం వలన. ధరలీ విధంగా ఎందుకు

వున్నాయో? వస్తువుల ధరలు విపరీతంగా ఎందుకు పెరుగుతాయి? —దానికి సమాధానం ఆర్థిక శాస్త్రం చెబుతుంది.

రాజశేఖరం ఆలోచనలు ఒక కొలిక్కి రానేలేదు, ఆయన్ని చేయిపట్టుకుని ఆపేడు బాలూ.

బాలూ రాజశేఖరం మూడో కొడుకు. చదువుతున్నది థర్డుఫారం.

"నాన్నా, ఇవాళ సాయంత్రిం లోపల ఫీజు కట్టాల లేకపోతే పేరు తీసేస్తారట"

"ఎవరన్నారా్రి" నిర్లక్షంగా అడిగేడు రాజశేఖరం.

"మా మేష్టారు నాన్నా"

"మీ మేష్టారుకు ఏమీ తెలియదురా! దేశంలో మనలాంటివాళ్ళు చాలా మంది ఉన్నారనే తయతలచి ఉచిత విద్యావిధానం ప్రివేశ పెట్టేరు ప్రిభుత్వము వారు. ఈవిషయం మీ మేష్టరికి తెలిసి వుండదు."

"అదిగాదు నాన్నా — స్పెషల్ ఫీజు"

రాజశేఖరం చప్పున నాలిక కరుచుకున్నాడు. ఆ విషయమే మరచి పోయాడు. స్పెషల్ ఫీజు కట్టాలనే విషయం బాబు తనతో చెప్పి వారం రోజులైంది. వారం రోజులుందికదా ఏదో సర్దుబాటు చేసుకోలేక పోతానా అని అప్పట్లో అనుకున్నాడు. ఆతర్వాత ఆవిషయమే మర్చి పోయాడు.

"సర్లే నువ్వెళ్ళు" అన్నాడు రాజశేఖరం ముందుకు కదులుతూ.

బాలూ అక్కడ్నించి కదల్లేదు. రాజశేఖరం కొంచెం దూరం వెళ్ళాక "నాన్నా" అని పిలిచాడు.

రాజశేఖరం క్షణమాగి వెనక్కి తిరిగి బాలూని చూసి తడబాటుతో "వెళ్ళు వెళ్ళు-ఆలస్యమైతే పాఠాలుపోతాయి" అనేసి బాలూ మాటాడే అవకాశమే ఇవ్వకుండా చకచకా నడిచి వెళ్లేడు. తనకు తెలుసు బాలూ ఎందుకు పిల్చాడో. "ఏదైనా కొనుక్కుంటాను పది పైసలివ్వు నాన్నా" అని అడగటం వాడికీ మధ్య అలవాటయింది. తనే సమాధానం చెప్పగలడు?

అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్న రాజశేఖరం ఎదురుగా వస్తున్న లలితను గుర్తించలేదు.

దగ్గరగావచ్చి ఆగిపోయింది లలిత—తనకు జీవితంలో ఎదురయ్యే సమస్యల్లా. పబ్లిక్ బజార్లో నడుస్తున్న తనకు అడ్డంగా నిలిచిన ఆకారాన్ని తన కూతురు లలితగా పోల్చుకునేసరికి రాజశేఖరంకి కొన్ని క్షణాలు పట్టింది.

"ఏఁవిటమ్మా వచ్చేస్తున్నావేం!" అని అడిగాడు కూతుర్ని. లలిత మాట్లాడలేదు. "శెలవిచ్చారా!" లలిత తల అడ్డంగా తిప్పింది. "పుస్తకాలేమైనా మర్చిపోయావా!"

అప్పటికీ నోరు మెదపలేదు లలిత. రాజశేఖరానికి తెలుసు—ఆ పిల్ల మేదకురాలని. ఆ అమ్మాయి చెప్పవలసిన

దానికి జవాబుచెప్పకపోతే ఎలా చావటము? 'నీకూ్కడా స్పెషల్ ఫీజు ఏమైనా కట్టాలా?'

అవునన్నట్లు తలవూపిందిలలిత. ఆ అమ్మాయి మూడవ తరగతి పరిజ్ఞానంలో ఫీజు, స్పెషల్ ఫీజు-ఒకేమాటకి పర్యాయ పదాలు మాత్రమే. ఆ రెంటికీ అర్థంలో తేడా వుందని తెలీదు. అందువల్లనే ఫీజు అనే మాట నోటివెంట రాగానే అవునన్నట్లు తల ఊపేసింది. ఐతే రాజశేఖరానికి లలిత సమాధానంతో పనిలేక పోయింది. అతనికి జ్ఞాపకము వచ్చింది ఇప్పుడు, లలితకు ట్యూషన్ ఫీజు రెండు నెలలనుంచీ ఇవ్వలేదని. ప్రైవేటు స్కూల్లో శ్రద్ధగా పాఠాలు చెప్తారనీ, తను ఇంటివద్ద గొంతు చించుకునే అవసరం తగ్గుతుందనీ. లలితను అక్కడ చేర్పించాడు. మూడోతరగతి జీతం నెలకు మూడురూపాయలు.

"డబ్బు తెచ్చిందాకా బడికి రావద్దు అన్నాడు" అన్నది లలిత బుంగమూతిపెట్టి.

రాజశేఖరం ముఖం అవమానంతో కుంచించుకు పోయింది. ఐనా లేని చిరునవ్వు తెచ్చుకుంటూ "అలాగా, సాయంత్రం యిద్దాంలే, ఈపూటకి ఇంటికివెళ్లు" అన్నాడు,

లలిత సంతోషంతో ఇంటిదారి పట్టింది. రాజశేఖరం ఆలోచనతో ముందుకు కాళ్ళీడ్చాడు.

తన ఆశయాలలో పిల్లలచదువు ముఖ్యమైనది. తన కిప్పటికి ఆరుగురు సంతానం. ఎన్ని అవస్థలు పడవలసివచ్చినా

సరే, పిల్లలందరికీ విద్యాబుద్ధులు చెప్పించాలనే తన పట్టుదల. తనఆశయ సాధనకు దేవుడిలావచ్చి సాయం చేస్తానంటూ పెద్ద పిల్లలిద్దరినీ తనదగ్గర పెట్టుకుని చదివిస్తున్నాడు తమ్ముడు. చిన్నపాటి పెద్దఉద్యోగమే చేస్తున్నాడతను. అయితే ఏం!— ఎవరి సంపాదనకు తగినఖర్చు వారికి వుండనేవుంటుంది. ఐనా తను అడక్కుండానే తమ్ముడు—ఇద్దరు పెద్దపిల్లల చదువు బాధ్యతనూ తీసుకున్నాడు. అలాంటివాణ్ణి పదీ పాతికా సర్దుబాటు చేయుమని తను ఎలా అడగ్గలడు!

తనకూ తన భార్యకూ ఏకాభిప్రాయంకుదరని చర్చనీయాంశాలంటూ ఏమైనావుంటే వాటిలో అగ్రస్థానం వహిస్తుంది—తమ్ముడివిషయం.

"మీకసలు ఏంవీ తెలియదండీ. ఒక లక్షాధికారివచ్చి 'డబ్బుకోసం చాలా ఇబ్బందిపడుతున్నానండీ' అంటే నమ్మేస్తారు. లేకుంటే మీతమ్ముడి దగ్గర డబ్బువుండదంటే ఎవ్వరూ నమ్మరు. మనమట్టుకు మీరెంత సంపాదిస్తున్నారుచెప్పండి. పాఠాలమీద ఏభై, పైన పాటకచ్చేరీలు, హరికథలమీద యాభై, మొత్తం కలిపి మహావస్తేనూరు, నూటపాతికవరకు. ఆయనకో—మూడువందలపాతిక. అవునా? మీ సంపాదన, కుటుంబంఖర్చూ ఆయనకు తెలీని విషయాలా? పదీ పాతికా సర్దలేడూ. కష్టపడి బియ్యేదాకా చదువు చెప్పిస్తిమికదా? బదులుకు బదులు ఒకరికీ ఇద్దరికీ చదువు చెప్పించటంకూడా గొప్పేనా?" అంటుంది సీత.

మరొకవిషయం సంగతి ఎలావున్నా, తమ్ముడి విష

యంలో తానామెమాటల్ని ఖాతరుచెయ్యడు. తమ్ముడి నైతే మాత్రం తానుగా అర్థించగలడా?....

రాజశేఖరం క్షణంసేపు నిల్చుండిపోయాడు. ముని వేళ్ళతో నేలను అదిమిపట్టి కళ్ళు గట్టిగా మూసుకొన్నాడు.

ప్రపంచం గిర్రున తిరుగుతోంది. రంగురంగులచెమికీ తీగలు సుతారంగా సుళ్ళు తిరుగుతున్నై. కళ్ళుమూసుకునే తనస్థితికి నవ్వుకోవాలనిపించింది. ఏమూలనోవున్న సభ్యత, జాలి ఆ పని చేయనివ్వలేదు. తాను బయలుదేరి వచ్చినపని గుర్తుకొచ్చింది.

శరీరం తిరిగి స్వాస్థ్యం పొందిందని తెలుసుకున్నతర్వాత కళ్ళు తెరిచి ప్రక్కనేవున్న కుళాయి దగ్గరికి పోయి మూడు దోసిళ్ళనీళ్ళు గటగటాత్రాగి ముఖం కడుక్కున్నాడు. అప్పుడు కర్తవ్యాన్ని ఆలోచించటానికి సుముఖమైంది మనస్సు.

ఇప్పుడు ఇంటికి బియ్యం తీసుకువెళ్ళేదెలా? ఏడెనిమిది సంవత్సరాలుగా బియ్యమూ, వెచ్చాలూ నెలకు సరిపడా సప్లయిచేస్తూ నెలాఖరున డబ్బు తీసుకుంటున్న సెట్టి గుర్తు కొచ్చాడు. ఇప్పుడాయనదగ్గఱకు పోయి మాత్రం ఏంలాభం? ప్రభుత్వం చౌకదుకాణాలుపెట్టి సరసమైనధరకు బియ్యాన్ని సరఫరా చేయడం మొదలెట్టిన తర్వాత సెట్టిగారు బియ్యం వ్యాపారాన్ని విధిగా మానివేయవలసివచ్చింది. చౌకదుకాణాల్లో అప్పుపెట్టరు. యేమిటి చెయ్యడం? ఈరోజుకూడా పస్తేనా? ఇలా ఎన్నిపూటలు? ఎన్నిరోజులు?

రాజశేఖరానికి ఇంటివద్ద సీతమ్మ కళ్ళకు కట్టింది. తాను బియ్యం తెస్తానని, తీసుకురాగానే వండి ప్రొద్దుట్నుంచీ ఆకలితో నకనకలాడుతున్న పిల్లలకు పెట్టాలని ఆతృతగా ఎదురుచూస్తూవుంటుంది. పాలకుకూడా నోచుకోని పసిపిల్ల!- ఏడ్చిఏడ్చి నిద్రపోతోందేమో? అది ఆకలికి అసలే నిలవ లేదు. నిద్రలోనైనా వెక్కుతూ అంతలోనే పాలు చప్ప రిస్తూన్నట్లు నోటిలోని నాలుకనే చప్పరిస్తూ.... రాజశేఖరం హృదయం పిండినట్లైంది — పదిరోజులుగా పస్తున్నవాడైనా మోహన రాగస్వరానికి పడగవిప్పి ఆడుతూ పరవశం చెంది నట్లు అయిపోయాడు రాజశేఖరం, ఇంట్లోనుంచి వినిపించిన రాగాలాపనకు.

చక్కనిరాగం, సంపూర్ణమైనరాగం— చక్రవాకం! ఆ రాగానికే అందాన్ని కూరుస్తోంది కమ్మనికంఠం. రాగాలాపన, పల్లవి, అనుపల్లవి, చరణం అన్నీ అయినతర్వాత ఆగిపోయింది మధురస్వరం.

ఆగిన రాజశేఖరంమాత్రం కదల్లేదు, అలాగేనిల్చుండి పోయాడు. జీవితంలో అన్నీ కోల్పోయి మిగుల్చుకొన్న ఆశ ఇక్కడ ఆయన్ని వదల్లేదు. మళ్ళీ మరో రాగాన్ని ఆలపిం చదా, మంచికీర్తనను వినిపించదా— అనేదే ఆ ఆశ!

హఠాత్తుగా రాజశేఖరానికి ఏదో స్ఫురించింది. కొంచెం సేపు అటూ ఇటూ తచ్చాడాడు. ఆయన ఆలోచనలకు స్థిరత్వం ఏర్పడింది; నమ్మకం కుదిరింది. ఆకంఠం తనకు పరిచితమే! అది వరలక్ష్మి కంఠం!

రాజశేఖరం ఆయింటి గుమ్మంలోకి వెళ్ళి లోపలికి తొంగిచూసేడు. ఎవరో యిద్దరు స్త్రీలు కూర్చునివున్నారు. ఏవో కబుర్లు చెప్పుకొంటూ మనసారా నవ్వుకుంటున్నారు. రాజశేఖరం వెనక్కు తిరిగి వెళ్దామనుకొన్నాడు.

అంతలోనే "మాష్టారూ!" అంది ఆ కంఠం— ఆశ్చర్యంగా.

రెండవ కంఠం, "రండి.... లోపలికి రండి" అంటూ వాకిలిదాకా వచ్చి ఆహ్వానించింది రాజశేఖరాన్ని.

"వరలక్ష్మి! నువ్వేనా వరలక్ష్మి! నే నప్పుడే అనుకున్నా. ఆ కిన్నరస్వరం నీదేనని. ఎప్పుడొచ్చావుతల్లీ? ఎక్కడుంటున్నావిప్పుడు? కులాసాయేనా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు రాజశేఖరం.

వరలక్ష్మి కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. ఆమె వాటిని తుడుచుకొంటూ "మిమ్మల్ని చూడగలిగినందుకు చాలా సంతోషంగావుందిమాష్టారూ" అంది. అని, వెంటనే "మీరు చాలా పెద్దవారైపోయారండీ" అన్నది— ఆశ్చర్యంగా కళ్ళు త్రిప్పుతూ.

"ఐదేళ్ళకే" అన్నాడు పొడిగా, రాజశేఖరం.

"మా స్నేహితురాలు ఉమ. మద్రాసులోనాకు ఆప్తురాలై అండగానిల్చిన సోదరి. ఈమె శ్రీవారు ఇప్పుడీ ఊళ్ళోనే 'ఆఫీసరు'" అంటూ స్నేహితురాల్ని పరిచయం చేసింది వరలక్ష్మి.

ఉమ లోపలికి వెళ్ళి మూడుకప్పులలో కాఫీ తెచ్చింది

గడచిన ఐదేళ్ళలోనూ తను గడించిన ఖ్యాతినీ, అనుభవాన్నీ పిచ్చాపాటీగా వరలక్ష్మి ముచ్చటిస్తుంటే మంత్రముగ్ధుడిలా కూర్చుండిపోయి, గతాన్ని నెమరువేస్తున్నాడు రాజశేఖరం.

వరలక్ష్మి అదృష్టవంతురాలే! నూరురేకుల పరిమళ పుష్పమే ఒకప్పుడు. విధి చిన్నచూపులో ఒక్క రేకు రాలిపోతే అప్పటివరకూ ఆరాధించినభక్తుడు, భరించినభర్త—చీదరించుకొని చెప్పకుండా అదృశ్యమైపోతే, దారీతెన్నూ తోచక, అఘాయిత్యానికి ఒడిగట్టిన వరలక్ష్మిని రక్షించింది రాజశేఖరమే. మానవశరీరంలోని వైచిత్ర్యాన్ని తెలిపి, ఒకకాలు పోయినంత మాత్రాన జీవితాన్ని అంతంచేసుకో నవసరంలేదని నచ్చచెప్పి, స్వశక్తిపైన నిల్చునే తెరవును ఏర్పరచింది — ఈ సంగీతంమేష్టారే, వరలక్ష్మి చిన్ననాడు నేర్చుకొన్న కొద్దిపాటి సంగీతజ్ఞానాన్ని వృద్ధిపఱచుకొని మద్రాసులోని బాలికల సంగీత పాఠశాలకు ఉపాధ్యాయురాలుగా వెళ్ళిననాడు, ఆనందంతో తృప్తిగా గాలి పీల్చుకున్నది, ఒక్క రాజశేఖరం హృదయమే.

"అవును, కోయిలపాటని మెచ్చుకొనేవారు, కోయిల రంగైన నలుపుకుకూడా విశిష్టస్థానం ఇచ్చినట్లుగా, వరలక్ష్మితోపాటు, ఆమె ఆసరాగా వాడుకొనే కొయ్యకాలుకు కూడా గౌరవం పెరిగిపోయిందిప్పుడు." అనుకున్నాడు రాజశేఖరం.

గడియారం ఠంగున ఒకటి కొట్టింది. రాజశేఖరం ఉలిక్కిపడి లేచాడు. మాట్లాడటాన్ని ఆపింది వరలక్ష్మి. "చాలా సేపయిందివచ్చి— వెళ్తాను" "వెళ్ళేలోపల కనిపిస్తా లెండి" అన్నది వరలక్ష్మి రెండుచేతుల్నీ జోడించి నమస్కరిస్తూ. ఆమె చేతివేళ్ళకున్న ఉంగరాలలోనిరాళ్లు తళుక్కుమన్నై.

రాజశేఖరం మనస్సులో మళ్ళీ ఆలోచన రగిలింది. ఇప్పుడు ఉత్తచేతుల్తో యింటికివెళ్ళటం ఎలా? తను ఓ కప్పు కాఫీఅయినా తాగ్రేడు. ఇంటిదగ్గర సీతకు, పిల్లలకు అదికూడ లేదుకదా? పోనీ, వరలక్ష్మి పరిస్థితి కొంచెం మెరుగ్గానేవుంది. అడిగితే ఓ పాతికరూపాయలు సర్దకపోతుందా? అనిపించింది. కాని, అడగటానికి మనసొప్పలేదు. అహం అడ్డు నిల్చింది. పస్తులున్నా పోనిదది.

మరో సందేహమూకలిగింది. ఒకవేళ .అడిగినా సమయానికి ఆమెదగ్గర వున్నవో, లేవో? వుంటే, జీవనోపాధి కల్పించిన తనకు లేదనలేదుకదా! లేకపోతే! ఆమెను బాధపెట్టి తాను బాధపడవలసి వుంటుంది, అని సమాధానపరుచుకుని వాకిలిదాటేడు. "మాష్టారూ ఒక్కక్షణం ఆగండి"అని పిలిచింది ఉమ.

రాజశేఖరం నిల్చున్నాడు. అయాచితంగా ఓపాతికో పరకో చేతిలోపెడితే బావుండు ననిపించింది. 'ఈరోజు పస్తుపడుకోకుండా పరువు నిలవాలంటే ఇదొక్కటే ఆశ' అనుకున్నాడుకూడా.

తన ఆలోచనకు తనకే నవ్వొచ్చింది రాజశేఖరానికి. ఆకలి మానవుల్ని ఎంతటి నైచ్యానికి దిగజారుస్తుందో అర్థమైంది.

లోపల్నుంచి వరలక్ష్మి కొయ్యకాలుతో వాకిలిదాకా నడిచింది. ఉమ వరలక్ష్మికి బాసటగా ముందుకొచ్చింది.

"మాష్టారూ ఇటీవల నేనుకొన్ని కీర్తనల్ని వ్రాయటం తటస్థించింది. వాటిని అచ్చువేయించాను, పరిశీలించి మీ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా తెలియజేయండి. మళ్ళీ మిమ్మల్ని కలుస్తానను కోండి" అంటూ ఒకపుస్తకాన్ని చేతిలో వుంచింది.

హతాశుడైన రాజశేఖరం పుస్తకాన్ని అందుకొని నడక సాగించాడు.

రాజశేఖరం ఇల్లు చేరేసరికి రెండు కావచ్చింది. ప్రాణం శోషపోతోంది. చిల్లరకొట్టు సెట్టిగార్ని బ్రతిమలాడి వాళ్ళింట్లో బదులుతీసుకొచ్చిన రెండుకప్పుల పాలపొడిని సీతమ్మకు అందిస్తూ, "పాలుకలిపి చంటిదానికిపోయి. మిగిలితే మనమంతా తలాకొంచెం త్రాగి గొంతు తడుపుకుందాం. ఈపూటకి" అన్నాడు.

విస్తుపోయిచూస్తున్న సీతమ్మతో మరి మాట్లాడకుండానే, పై ఉత్తరీయాన్ని, చేతిలోని పుస్తకాన్ని, చేతి సంచీనీ చుట్టచుట్టి విసురుగా మంచంపైకి గిరవాటేసి తన గది లోకివెళ్ళి తలుపులు బిగించేసుకున్నాడు రాజశేఖరం.

*　　*　　*

సాయంత్రం నాలుగు గంటలైంది — తలుపులు బాదగా బాదగా విసుక్కుంటూ లేచి, గదితలుపులు తీసిన రాజశేఖరం—కళ్ళు నులుముకొంటు "తెల్లవారిందటే" అని అడిగేడు.

"తెలివి తెల్లవారినట్లేవుంది. భోంచేద్దురుగాని రండి" అంది సీతమ్మ. "భోజనమా?" రాజశేఖరం అనుమానంగా చూశాడు అర్ధాంగివైపు.

తెచ్చిన పుస్తకాన్ని ఉత్తరీయంతోసహా మంచం మీదకు గిరవాటేశారు - ఆ పుస్తకంలో ఐదువందల రూపాయలనోట్లూ, 'దీనితో ఋణవిముక్తను కాలేకపోయినా గురుదక్షిణగా మీకే ఐదువందలూ ఇవ్వదలిచాను. అభిమానవంతులైన మీరు దీన్ని స్వీకరిస్తారో లేదోననే అనుమానంతో ఇలా పుస్తకంలోపెట్టి ఇవ్వవలసివచ్చింది — వరలక్ష్మి' అని వున్న ఉత్తరమూ భర్త చూశాడా లేదా—తను చెప్పాలా వద్దా అని ఆలోచిస్తోంది సీతమ్మ! *

